




# వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

మంగళవారం,
నవంబరు 4, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## పాక్ చైనా అణుపరీక్షలు చేస్తున్నాయి

::: అమెరికా అధ్యక్షుడు ట్రంప్

## 'కూటమిలో పప్పు, తప్పు, అప్పు' : సీఎం యోగి



## ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేయడం మా ధ్యేయం

- అత్యాధునిక సాంకేతికత వినియోగం: సీఎం రేవంత్.. "ఇప్పుడే పూర్తి చేయకపోతే మళ్లీ అవకాశం ఉండదు
- ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ముందుకు
- మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డితో కలిసి హెలిబోర్న్ సర్వే ప్రారంభం
- "కాంగ్రెస్‌కి క్రెడిట్ వస్తుందని కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా నిలిపాడు
- తక్కువ ఖర్చుతో నీటి ప్రాజెక్టు - లక్షల మందికి లాభం



మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్, నవంబర్ 3: శ్రీశైలం ఎడమ గట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్టు పూర్తి చేయడం తమ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలిసి అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి వద్ద హెలిబోర్న్ ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాజెక్టు పూర్తి కోసం అంతర్జాతీయ ప్రమాణాల ఆధారంగా ఆధునిక పరికరాలు, టెక్నాలజీ వినియోగిస్తామని సీఎం చెప్పారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతం గుండా సొరంగం తవ్వడం చాలా క్లిష్టమైన పని అయినప్పటికీ, ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేస్తామని

(మిగతా 2వ పేజీలో)



## బీజేపీ గెలుపే ఖాయం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ కింగ్ : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తెల్లవారక ముందే తాండూరు నుంచి హైదరాబాద్ బయల్దేరిన ఆర్టీసీ బస్సు ప్రయాణం మధ్యలోనే విషాదకర మలుపు తీసుకుంది. చేవెళ్ల మండలంలోని మీర్జాగూడ గేట్ వద్ద కంకరతో నిండిన టిప్పర్ వేగంగా దూసుకొచ్చి బస్సును ఢీకొట్టడంతో ఇద్దరు డ్రైవర్లు సహా 19 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 మందికి గాయాలు కాగా, వారిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది



# నెత్తురోడిన రహదారి

**ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన టిప్పర్.. 19 ప్రాణాలు బలి**

- తెల్లవారక ముందే ఘోర ప్రమాదం - నిద్రలోనే మృతి చెందిన ప్రయాణికులు
- కంకర టిప్పర్ బస్సుపై ఒరిగిపడి 8 వరుసల సీట్లు నుజ్జునుజ్జు
- ఇద్దరు డ్రైవర్లు సహా 19 మంది మృతి, 25 మందికి గాయాలు
- గాయపడిన వారిలో నలుగురి పరిస్థితి విషమం
- కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో చేవెళ్ల దవాఖానలో కన్నీరుమున్నీరు
- మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు, ఆర్టీసీ రూ.2 లక్షలు, కేంద్రం రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా
- ప్రధానమంత్రి మోదీ, సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ సంతాపం వ్యక్తం

రంగారెడ్డి జిల్లా, నవంబర్ 3 : తాండూరు డిపోకు చెందిన బస్సు (టీఎస్ 34టీఏ 6354) తెల్లవారుజామున 4.30 గంటలకు 30 మంది ప్రయాణికులతో హైదరాబాద్ బయలుదేరింది. మార్గమధ్యంలో మరికొందరు ఎక్కడంతో ప్రయాణికుల సంఖ్య 70 దాటింది. చేవెళ్ల-వికారాబాద్ హైవేపై ఎదురుగా వచ్చిన కంకర టిప్పర్ (టీజీ 06టీ 3879) బస్సును బలంగా ఢీకొట్టడంతో టిప్పర్ బస్సుపై ఒరిగిపోయింది. కంకర మొత్తం బస్సులోకి జారిపడడంతో కుడివైపు ఎనిమిది వరుసల సీట్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదం తెల్లవారుజామున జరగడంతో చాలామంది ప్రయాణికులు నిద్రలో ఉన్నారు. ఢీకొట్టిన వెంటనే బస్సులోకి కంకర జారిపడడంతో కొందరు ఊపిరాడక చనిపోయారు. కొందరికి తీవ్రగాయాలు కాగా, మరికొందరు బస్సు లోపల చిక్కుకుపోయారు. డ్రైవర్లు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో తాండూరుకు చెందిన 12 మంది మహిళలు, ఆరుగురు పురుషులు, ఒక 10 నెలల చిన్నారి ఉన్నారు. తాండూరులోని ట్రావెల్స్ యజమాని ఎల్లయ్యగౌడ్ ముగ్గురు కూతుళ్లు ు నందిని, సాయిప్రియ, తనూష

(మిగతా 2వ పేజీలో)





## ఒక్కసారి చాన్స్ చాలు.. రాష్ట్రం దారితప్పింది ::: కేటీఆర్

- బోరబండ రోడ్ షోలో సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజమెత్తారు
- కారు గెలిస్తేనే పేదల ఇళ్ల మీద బుల్డోజర్ ఆగుతుంది
- రేవంత్ ఢిల్లీకి కోట్ల రూపాయలు పంపుతాడు, పేదలకు పైసా ఇవ్వడు
- ఒక్కసారి అవకాశం ఇచ్చి చాలు, రాష్ట్రం దెబ్బతిన్నది

హైదరాబాద్, నవంబర్ 3 : జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో సీఎం రేవంత్‌రెడ్డిపై దాడి చేశారు. సోమవారం రాత్రి బోరబండలో పార్టీ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతూ, "కారు గుర్తును గెలిపించకపోతే పేదల ఇళ్ల మీద బుల్డోజర్ మళ్లీ దూసుకువస్తుంది. కారు గెలిస్తేనే ప్రజలకు రక్షణ ఉంటుంది," అని ప్రజలకు పిలుపునిచ్చారు. సీఎం కుర్చీ కాపాడుకునేందుకే రాహుల్‌గాంధీకి వందల కోట్లు పంపుతున్న రేవంత్‌రెడ్డి, కానీ పేదల సంక్షేమ పథకాల కోసం ఒక్క రూపాయి కేటాయించడం లేదు," అని కేటీఆర్ విమర్శించారు. "ఒక్క ఛాన్స్ అని

(మిగతా 2వ పేజీలో)

# నెత్తురోడిన రహదారి

హైదరాబాదుకు బయల్దేరి ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం కుటుంబాన్ని ముంచెత్తింది.

**సహాయక చర్యలు, కన్నీరుమున్నీరైన దవాఖాన**

స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, రెస్క్యూ బృందాలు చేరుకొని టిప్పర్‌ను క్రేన్ సాయంతో తొలగించాయి. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి ఆవరణలో కుటుంబ సభ్యుల ఆర్తనాదాలు మిన్నంటాయి. కలెక్టర్ నారాయణరెడ్డి పర్యవేక్షణలో పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాలను స్వగ్రామాలకు తరలించారు.

**ప్రభుత్వం, ఆర్టీసీ, కేంద్రం నుంచి పరిహారం**

ప్రభుత్వం తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ఆర్టీసీ నుండి రూ.2 లక్షలు, ప్రధానమంత్రి మోదీ ప్రకటించిన పీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మరణించిన వారికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున సాయం అందించనున్నారు.

**నేతల పరామర్శ**

మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితరులు చేవెళ్ల ఆసుపత్రిని సందర్శించి బాధిత కుటుంబాలను ఓదార్చారు. తాండూరుకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి



తదితరులు కూడా సంతాపం తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కేసీఆర్ మాట్లాడుతూ, "ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి," అని విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ గెలుపే ఖాయం

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ కింగ్ : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ కేవలం కింగ్ మేకర్‌గా కాకుండా, కింగ్‌గా నిలుస్తుందని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల కంటే భిన్నంగా ఈసారి త్రిముఖ పోటీ నెలకొన్నందున, బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ రాజకీయాలకు బీజేపీ కొత్త దిశ చూపబోతోందని తెలిపారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేన కార్యకర్తలు, అనుచరులు కూడా బీజేపీకి మద్దతుగా నిలుస్తున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉప ఎన్నికను పాకిస్తాన్‌తో ముడిపెట్టడంపై ప్రశ్నించిన కిషన్‌రెడ్డి, "కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు తప్ప ఇంకేం ఇచ్చింది?" అని విమర్శించారు. సంక్షేమ పథకాలు ఆపేస్తామనే సీఎం బెదిరింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.

**"కాంగ్రెస్‌పై ప్రజల నమ్మకం కరిగిపోయింది"**

ఆరు గ్యారంటీలు, వందల హామీలు అమలు చేయలేకపోయిన రేవంత్‌రెడ్డిని ప్రజలు నమ్మడం అసాధ్యమన్నారు. కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని కేటీఆర్ కలలు కంటున్నారంటూ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల్లో ఆధారం కోల్పోయిందని వ్యాఖ్యానించారు. ఉచిత బస్సులు మహిళలకు విండో షాపింగ్‌కే ఉపయోగపడుతున్నాయని వ్యంగ్యంగా అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన పతన దశలో ఉందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**జనగణన షెడ్యూల్ ప్రకటించారు**

దేశవ్యాప్తంగా జనగణన ఏప్రిల్ 1, 2026న ప్రారంభమై 2027 ఫిబ్రవరి 28న ముగుస్తుందని సెన్సస్ కమిషనర్ వెల్లడించారని ఆయన తెలిపారు. తొలి దశలో ఇళ్ల వారీగా వివరాలు, తదుపరి కులాల వారీ డేటా సేకరణ జరగనుందని చెప్పారు. సమాచారం పంపించేందుకు డిజిటల్ సదుపాయం కూడా ఉంటుందని వివరించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో కూడా ఉప ఎన్నిక జరగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఫోన్‌ట్యాపింగ్ కేసుపై హైకోర్టులో బీజేపీ పిటిషన్ వేసిందని తెలిపారు. ప్రైవేట్ కాలేజీలకు ప్రభుత్వం తక్షణమే రూ.600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 'ఫ్యామిలీ బిజినెస్'గా భారత రాజకీయాలు ::: శశిథరూర్




న్యూఢిల్లీ: సీనియర్ కాంగ్రెస్ నాయకుడు , తిరువనంతపురం ఎంపీ శశి థరూర్ భారత రాజకీయలపై కీలక వ వ్యాఖ్యలు చేశారు.'భారత రాజకీయాలు ఒక కుటుంబ వ్యాపారం' అనే వ్యాసంలో వంశపార్యంపర్యంగా వస్తున్న రాజకీయ అధికారం, నాయకత్వ సంస్కృతిపై కొన్ని ప్రశ్నలను లేవనెత్తారు. అంతేకాదు ఈ ధోరణి భారత ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందన్నారు. కాంగ్రెస్ నేతగా కాంగ్రెస్ పై స్పష్టమైన విమర్శలు చేయడం చర్చకు దారి తీసింది. దశాబ్దాలుగా, ఒకే కుటుంబం భారత రాజకీయాలపై ఆధిపత్యం చెలాయించింది అంటూ కాంగ్రెస్ వారసత్వం రాజకీయాలపై విమర్శలనెక్కుపెట్టారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం చరిత్రలో గొప్ప ?ప్రభావం ఉన్నప్పటికీ స్వతంత్ర భారతదేశ తొలి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, ప్రధాన మంత్రులు ఇందిరా గాంధీ .రాజీవ్ గాంధీ, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ,ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రాలతో సహా నెహ్రూ–గాంధీ వంశానికి జన్మతః హక్కుగా ఉండిపోయింది. క్రమంగా ఈ ఆలోచన ప్రతి పార్టీలోనూ, ప్రతి ప్రాంతంలోనూ, ప్రతి స్థాయిలోనూ భారత రాజకీయాల్లోకి చొచ్చుకుపోయిందంటూ వ్యాఖ్యానించారు. భారత రాజకీయాలు కుటుంబ వ్యాపారంగా మారాయి, ఇక్కడ నాయకత్వం జన్మతః హక్కుగా పరిగణించబడుతోంది' అని అభిప్రాయపడిన శశి థరూర్ వంశపారంపర్యంగా సంక్రమించే రాజకీయ అధికారం పాలన , జవాబుదారీతనాన్ని దెబ్బతీస్తుందని వాదించారు. ఎందుకంటే ఈ విధంగా ఎంపికైన నాయకులు తరచుగా ప్రజలు ఎదుర్కొంటున్న నిజమైన సవాళ్ల నుండి డిస్‌కనెక్ట్ చేయబడతారని విమర్శించారు. మమతా బెనర్జీ ,,మాయావతి వంటి ప్రత్యక్ష వారసులు లేని మహిళా రాజకీయ నాయకులు కూడా మేనల్లుళ్లను తమ వారసులుగా ఎంచుకున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్ట్ సిండికేట్‌లో ప్రచురించిన ఈ వ్యాసంలో శశి థరూర్, భారతీయ రాజకీయ రంగంలో రాజకీయ నాయకత్వం జన్మతః హక్కు అనే ఆలోచన స్థిరపడిపోయిందని, ఇది గ్రామ సభల నుండి పార్లమెంటు అత్యున్నత స్థాయి వరకు భారత పాలనలో ఇదే ధోరణి లోతుగా అల్లుకుపోయిందన్నారు. కానీ రాజకీయ వారసులే పాలనకు సరిపోతారనే విశ్వాంస పాతుకుపోయిందనీ. దీని పాలన నాణ్యత తప్పనిసరిగా దెబ్బతింటుందని థరూర్ రాసుకొచ్చారు. భారతదేశం రాజవంశాన్ని మెరిటోక్రసీగా మార్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. దీనికి ప్రాథమిక సంస్కరణలు అవసరం, చట్టబద్ధంగా తప్పనిసరి చేసిన పదవీకాల పరిమితులను విధించడం మొదలు, అర్థవంతమైన అంతర్గత పార్టీ ఎన్నికలు దాకా మెరిట్ ఆధారంగా నాయకులను ఎన్నుకునేలా ఓటర్లకు అవగాహన కల్పించడానికి, అధికారం ఇవ్వడానికి సమిష్టి కృషి కావాలన్నారు. భారత రాజకీయాలు కుటుంబ సంస్థగా ఉన్నంత కాలం, 'ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే' అనే నిజమైన ప్రజాస్వామ్య కల పూర్తిగా సాకారం కాబోదని ఆయన చెప్పారు. కాగా సీనియర్ కాంగ్రెస్ నేతగా ఆయన ప్రత్యక్షంగా కాంగ్రెస్ పార్టీపైనే తన విమర్శలను ఎక్కుపెట్టడం చర్చకు దారి తీసింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి గతంలో ఆయన గతంలో పోటీని దృష్టిలో ఉంచుకునే ఈ వ్యాఖ్యలు చేసినట్టు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు.



# ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేయడం మా ధ్యేయం

పేర్కొన్నారు. మొత్తం రూ.4,600 కోట్ల వ్యయంలో ప్రాజెక్టును పూర్తి చేయనున్నట్లు వివరించారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ఆయన మరణం తర్వాత నిలిచిపోయిందని సీఎం తెలిపారు. "కాంగ్రెస్ హయాంలో 30 కి.మీ. సొరంగం నిర్మాణం పూర్తయింది. కానీ బీఆర్ఎస్ పదేళ్లలో 10 కి.మీ. కూడా పూర్తి కాలేదు, అని విమర్శించారు. "ప్రాజెక్టు పూర్తయితే కాంగ్రెస్‌కి పేరు వస్తుందనే భయంతో కేసీఆర్ పనులు ఆపేశాడు, అని రేవంత్ ఆరోపించారు. కేసీఆర్ పాలనలో ప్రాజెక్టుల పేరుతో రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినా, ఒక్క పనీ పూర్తికాలేదని మండిపడ్డారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలకే పరిమితి విధించేలా కేసీఆర్, హరీశ్‌రావు సంతకాలు చేయడం వల్ల రాష్ట్రం నీటి హక్కులు కోల్పోయిందని రేవంత్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం సుప్రీంకోర్టు, ట్రిబ్యునల్‌లలో ప్రజల హక్కుల కోసం వాదిస్తున్నదన్నారు. 'ఈసారి పూర్తి చేయకపోతే భవిష్యత్తులో ఎప్పటికీ సాధ్యం కాదు, అని సీఎం స్పష్టం చేశారు. తాను పాలమూరు జిల్లా, ఉత్తమ్ నల్లగొండ జిల్లాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నందున ప్రాజెక్టు పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించే సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు దేశంలోనే ప్రత్యేకమని రేవంత్ వివరించారు. దీని ద్వారా నల్లగొండ జిల్లాలో 30 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల ఎకరాలకు సాగునీరు లభిస్తుందని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, "ఎస్ఎల్‌బీసీ తక్కువ ఖర్చుతో అత్యధిక ప్రయోజనం కలిగించే ప్రాజెక్టు అని అన్నారు. సొరంగ తవ్వకానికి రక్షణ దళ నిపుణుల సేవలను వినియోగిస్తున్నామని చెప్పారు. కల్నల్ పరీక్షిత్ మెహ్రా, హర్‌పాల్‌సింగ్‌లను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమించామని వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ, "సీఎం స్వయంగా పర్యవేక్షిస్తున్న ప్రాజెక్టు కావడంతో ఇది విజయవంతం అవుతుందనే నమ్మకం ఉంది అన్నారు. టీబీఎం పరికరాల కొనుగోలు కోసం అమెరికా వెళ్లినట్లు తెలిపారు. ఎన్జీఆర్ఐ డైరెక్టర్ ప్రకాశ్‌కుమార్, చీఫ్ సైంటిస్ట్ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, బాలునాయక్, ఇంజినీర్లు విజయ్‌భాస్కర్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఎం ఈ రెడ్డి గార్డెన్స్ లో వైభవంగా సాయికిరణ్ - శ్వేత ల వివాహ రిసెప్షన్ వేడుక హాజరైన బద్దం ధనుంజయ్ గౌడ్, సికీల మెట్ల శ్రీహరి,

వనస్థలిపురం వార్త మిర్రర్ ప్రతినిధి : రామంతపూర్ వసుంధర ఫర్నిచర్ అధినేత చర్క బాల నరసింహ సోదరుడు వేణుగోపాలకృష్ణ– పద్మావతి లా కుమారుడు సాయి కిరణ్ – శ్వేతాల వివాహ రిసెప్షన్ వేడుకని ఎం ఈ రెడ్డి గార్డెన్స్ లో ఘనంగా నిర్వహించారు, ఈ వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరై నవ వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్, యాదాద్రి జిల్లా మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు సీకీల మెట్ల శ్రీహరి, వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ నగర్, ఈ కార్యక్రమంలో మోగుదాల శంకరయ్య, సత్తిపండు, అక్కనపల్లి వీరయ్య, వివిధ రాజకీయ పార్టీ నాయకులు, పలు వ్యాపార సంస్థల అధినేతలు చర్క వారి బంధుమిత్రులు పాల్గొన్నారు


## పరిశోధనాభివృద్ధికి కొత్త దిశ ప్రధాని మోదీ చేతులమీదుగా రూ.1 లక్ష కోట్ల ఆర్‌అండ్‌డి-ఇన్నోవేషన్ ఫండ్ ప్రారంభం

న్యూఢిల్లీ: శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారత్‌ను ప్రపంచ ముందంజలో నిలబెట్టే లక్ష్యంతో రూ.1 లక్ష కోట్ల పరిశోధనాభివృద్ధి మరియు ఆవిష్కరణ నిధిని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ప్రైవేట్ రంగం పెట్టుబడులను ప్రోత్సహించి, ఆధునిక పరిశోధనలకు దారితీయడమే ఈ నిధి ప్రధాన ఉద్దేశమని ఆయన వివరించారు. సోమవారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ సమ్మిట్‌లో ఈ నిధిని ప్రారంభించిన మోదీ, దేశ భవిష్యత్తుకు ఇది కీలక మలుపు అవుతుందన్నారు. "భారత్ శాస్త్రసాంకేతిక రంగంలో మహాశక్తిగా ఎదగాలి," అని ప్రధాని మోదీ అన్నారు. ప్రైవేట్ పరిశోధనలకు ప్రోత్సాహం, విధానాల్లో విప్లవాత్మక సంస్కరణలు ఈ దిశగా కీలకమని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న వేగవంతమైన పరిణామాల నడుమ భారత్ తన ఆవిష్కరణ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటుకోవాలన్నారు. లక్ష కోట్ల మూలనిధి సృష్టించడం ద్వారా ప్రభుత్వం పరిశోధనలకు విస్తృత వేదిక కల్పించిందని, ఇది ప్రజలకు కొత్త అవకాశాల తలుపులు తెరుస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. ఆహార భద్రతతో పాటు పోషక భద్రతపై కూడా శాస్త్రవేత్తలు దృష్టిపెట్టాలని ప్రధాని సూచించారు. సేంద్రీయ వ్యవసాయానికి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే ఆవిష్కరణలను అభివృద్ధి చేయాలని కోరారు. జన్యు వైవిధ్యాన్ని ఉపయోగించి నూతన ఔషధాలు, శుద్ధ ఇంధన సాంకేతికతలు రూపకల్పన చేయగల సామర్థ్యం భారత్‌కుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇంతటి భారీ నిధిని తొలిసారిగా అత్యంత క్లిష్టమైన, ప్రభావవంతమైన పరిశోధన ప్రాజెక్టులకు కేటాయిస్తున్నామని మోదీ తెలిపారు. ప్రైవేట్ రంగ పరిశోధనలను ఉత్సాహపరచడం, నియంత్రణల సరళీకరణ ద్వారా కొత్త ఆవిష్కరణ వాతావరణాన్ని విస్తరించడం తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# ఒక్కసారి చాన్స్ ఇచ్చినా చాలు రాష్ట్రం దారితప్పింది : కేటీఆర్

మోసం చేసి వచ్చిన ప్రభుత్వం రెండేళ్లలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదు. ఒక్క అవకాశం ఇచ్చినందుకే రాష్ట్రం స్తంభించింది, ఇంకో అవకాశం అడగడానికి సిగ్గు లేద?" అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వర్గాన్నీ మోసం చేసిందని, రైతులు, కూలీలు, యువత అందరూ నష్టపోయారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం నంబర్‌వన్ స్థాయి నుంచి అట్టర్‌ఫ్లాప్‌గా మారింది. 700 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇదే కాంగ్రెస్ పాలన ఫలితం," అని మండిపడ్డారు. "రౌడీయిజం, దౌర్జన్యాలతో రేవంత్ ప్రభుత్వం ప్రజలను భయపెడుతోంది. ఈ జూబ్లీహిల్స్ నుంచే ఆ అరాచకానికి ముగింపు పలకాలి," అని పిలుపునిచ్చారు. కేటీఆర్ హామీ ఇస్తూ, "బీఆర్ఎస్ గెలిస్తేనే కాంగ్రెస్ నిలిపేసిన పథకాలను మళ్లీ అమలు చేయిస్తాం," అన్నారు. "నిరుద్యోగులు తమ హక్కులు అడిగితే అరెస్టులు చేస్తున్నారు. నోటిఫికేషన్లు ఇవ్వకుండా ప్రజా డబ్బు లూటీ చేస్తున్నారు," అని విమర్శించారు."రాహుల్‌గాంధీ మితా మాటలు చెబుతాడు కానీ చేయేది ఏమీ లేదు. హిట్లర్‌లాంటి నేతలను ప్రజలు గద్దె దించారు, రేవంత్ ఎవరు?" అని ప్రశ్నించారు. "కులమతాలకు అతీతంగా ప్రజలు కేసీఆర్‌నే తమ నాయకుడిగా కోరుకుంటున్నారు," అని కేటీఆర్ అన్నారు. రేవంత్ పాలనపై ఉర్దూ కవితలతో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రజల్లో ఉత్సాహం నింపుతూ, "రేపు మీ బోరబండ మీద బుల్డోజర్ రాకూడదంటే కారుకే ఓటేయండి. మీ కోసం నేనే ముందుంటాను," అని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకుడు సర్దార్ ఆత్మహత్య ఘటనను ప్రస్తావిస్తూ, "పార్టీ మారలేదని చెబుతూ ఆయన ఇంటిని కూల్చేశారు. ఇది కాంగ్రెస్ నిరంకుశత్వం," అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.

## 'కూటమిలో పప్పు, తప్పు, అప్పు': సీఎం యోగి



దర్భంగా: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇండియా కూటమిపై తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం బీహార్‌లోని దర్భంగాలో జరిగిన బహిరంగ ర్యాలీలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్, ఆర్జేడీల పనితీరును దుయ్యబట్టారు. వారి పాలనలో రాష్ట్రంలో ఏమి జరిగిందో గుర్తు చేశారు. ఆర్జేడీ–కాంగ్రెస్ కూటమిపై విమర్శల బాణాన్ని ఎక్కుపెట్టిన సీఎం యోగి.. వారి గత పాలనలో పేదలకు ప్రాథమిక అవసరాలు, సంక్షేమ ప్రయోజనాలు అందకుండా పోయాయని ఆరోపించారు. 2005కి ముందు కాంగ్రెస్, ఆర్జేడీ పాలనలో రాష్ట్రంలోని పేదలు అనారోగ్యానికి గురైతే, వైద్య సదుపాయాలు లేక బాధపడుతూ చనిపోయేవారని అన్నారు. మహాత్మాగాంధీ చెప్పిన మూడు కోతులు కథను గుర్తు చేస్తూ, నేడు ఇండియా కూటమిలో పప్పు, తప్పు, అప్పు అనే మూడు కొత్త కోతులు ఉన్నాయన్నారు. వాటి గుణాలను వివరిస్తూ పప్పు నిజం మాట్లాడలేడని, తప్పు సరైనది చూడలేడని, అప్పు నిజం వినలేడని అన్నారు. ఈ నేతలు ఎన్డీఏ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి పనులను చూడలేరు, వినలేరు, మాట్లాడలేరని, అందుకే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని యోగి ఆరోపించారు.



## శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరగబోయే సదర్ సమ్మేళనానికి డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కు ప్రత్యేక ఆహ్వానం

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

భువనగిరి పట్టణ కేంద్రంలో ఈ నెల 8వ తేదీన జరిగే సదర్ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ కు సదర్ సమ్మేళన ఆహ్వాన పత్రాన్ని అందించారు శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేశం ఈ కార్యక్రమంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన సురేష్ యాదవ్, శ్రీకృష్ణ యాదవ సంఘం యూత్ అధ్యక్షులు ర్యాకల రమేష్, పర్వతం రంజిత్ యాదవ్, తదితరులు ఆహ్వానించారు

## కిష్టంపేటకు బస్సు పునరుద్ధరించాలని వినతి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 3

జగిత్యాల జిల్లా రాయికల్ మండల పరిధిలోని కిష్టంపేట గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరిద్ధరించాలని గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ సిరిపురం సత్తయ్య, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నాయకులు తిరుమల శంకర్, బి ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షులు చిలక శ్రీనివాస్ సోమవారం రోజున ప్రజా వానిలో కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగిత్యాల డిపో బస్సు జగిత్యాల నుండి కండ్లపెల్లి, కిష్టంపేట మీదుగా అల్లీపూర్, మండల కేంద్రం రాయికల్, దావన్ పెల్లి వరకు ఆర్టీసీ నడపడం వలన పలు గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండేదని, ఏవో సాకులు చూపి ఆర్ టి సి వారు బస్సులు నిలిపేయడం వలన కిష్టంపేట గ్రామ ప్రజలు మండల కేంద్రం రాయికల్ వెళ్లాలన్న, జిల్లా కేంద్రం జగిత్యాల వెళ్లాలన్న 2.5 కిలోమీటర్లు నడిచి అల్లీపూర్ రోడ్డుకి వెళ్లి ప్రయాణం చేయవలసి వస్తుందని, ప్రజలు, స్త్రీలు, స్కూల్ విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికి ఎన్నిసార్లు ఆర్ టి సి అధికారులకు విన్నవించిన వారు బస్సును నడుపడం లేదని అన్నారు. కావున కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సిరిపురం సత్తయ్య, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నాయకులు తిరుమల శంకర్, బి ఆర్ ఎస్ గ్రామ అధ్యక్షులు చిలక శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## గోవిజ్ఞాన పరీక్షలలో సత్తా చాటిన విద్యార్థులకు ఘన సన్మానం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 3

గో సేవ విభాగం ప్రతి సంవత్సరం మాదిరిగానే 2025 సంవత్సరంలో గోవిజ్ఞాన పరీక్షలు నిర్వహించడం జరిగింది. దాంట్లో మొదటి లెవెల్ రెండవ లెవెల్ మూడో లెవెల్ దశలవారీగా రాష్ట్ర మొత్తం గోవిజ్ఞాన పరీక్షలు నిర్వహించడం జరిగింది. దాంట్లో మొదటి లెవెల్ జగిత్యాల జిల్లాలో 4,800 పైగా విద్యార్థులు పరీక్షలు రాయడం జరిగింది. దీంట్లో నుండి డిస్టిక్ లెవెల్ కి 420 మంది సెలెక్ట్ కాగా దాంట్లో నుండి 94 మంది స్టేట్ లెవెల్ కి సెలెక్ట్ అయ్యారు. కానీ 62 మంది స్టేట్ లెవెల్ లో ఎగ్జామ్ రాశారు. దాంట్లో దువ్వాక లావణ్య బీకాం ఇస్కాన్ భక్తురాలు జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ రాయికల్ నుండి కొత్తపెల్లి శ్రీరామ్ మరియు వివేక వర్ధిని స్కూల్ నుండి దొంతి శ్రీనిధి స్టేట్ లెవెల్ కి సెలక్ట్ అయ్యారు. కానీ కడకుంట్ల మన్విత్ మాత్రం 8వ తరగతి బాలుడు స్టేట్ లెవెల్ కి వెళ్లి అక్కడ 1800 మందితో పోటీలో ముందుకు వెళ్లి ఫైనల్ రౌండ్ వరకు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా స్కూలు యజమాన్యాన్ని అభినందిస్తూ స్టేట్ లెవెల్ వరకు వెళ్లి వచ్చినటువంటి మన్విత్ ను రాయికల్ గో సేవ ప్రముక్ సుమన్, వినోద్ జిల్లా సేవా ప్రముక్ సంతోష్, గుణ సర్టిఫికెట్లు అందజేసి సన్మానం చేయడం జరిగింది.



## ముందస్తు వ్యాధి నిర్ధారణ తోనే సంపూర్ణ ఆరోగ్యం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 3

ముందస్తు వ్యాధి నిర్ధారణతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొత్తపెల్లి రంజిత్ అన్నారు. సోమవారం రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో వాకర్స్, ఆర్ఎస్ఎస్ సభ్యులకు ఉచిత షుగర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. శిబిరంలో 106 మందికి ఉచితంగా షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా 12 మంది ని గుర్తించి షుగర్ వ్యాధి వైద్య సేవలు పొందాలని అవగాహన కల్పించారు. నవంబర్ మాసంలో ఉచిత డయాబెటిక్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డయాబెటిక్ కోఆర్డినేటర్ డిసి బత్తిని భూమయ్య, మ్యాకల రమేష్, లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, బొమ్మ కంటి నవీన్, గంట్యాల ప్రవీణ్, ల్యాబ్ టెక్నీషియన్లు మోసారపు సంతోష్, ప్రణయ్, మాజీ సర్పంచ్ డాక్టర్ రాజారెడ్డి, ఆర్ఎస్ఎస్ సభ్యులు గాజంగి అశోక్, సింగని రాందాస్, సతీష్, వాకర్స్ సభ్యులు బందెల శ్రీనివాస్, పుర్రె శ్రీనివాస్, చెంగలి గంగాధర్, తాటిపాముల మల్లికార్జున్, ప్రసాద్, దేవ రాజాం, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ గృహమంత్రి దక్షత పథక్ అవార్డ్ అందుకున్న సీఐ చంద్రబాబు

### మరిన్ని అవార్డులు అందుకోవాలి రాచకొండ సిపి సుధీర్ బాబు ఐపీఎస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి కేంద్రీయ గృహమంత్రి దక్షత పథక్ అవార్డు అందుకున్న యాదాద్రి భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు నగరి గారిని రాచకొండ సిపి జి.సుధీర్ బాబు ఐపీఎస్ , కమీషనర్ సిపి ఆఫీస్ నేరేడ్మెట్ లో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరిన్ని అవార్డు అందుకుని రాచకొండ కమిషనరేట్ కి మంచి పేరు తీసుకురావాలని కోరారు.భారతదేశంలోని అన్ని రాష్ట్రాల పోలీసులలో విశిష్ట సేవలు అందించినందుకు గాను యాదాద్రి భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు గారు కేంద్రీయ గృహమంత్రి దక్షత పథక్ అవార్డ్ అందుకున్నారు. ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి. 1.స్పెషల్ ఆపరేషన్స్, 2.ఇన్వెస్టిగేషన్, 3.ఇంటలిజెన్స్, 4.ఫోరెన్సిక్ సైన్స్ లలో అద్భుత ప్రతిభ కనబరిచిన వారికి మినిస్ట్రీ ఆఫ్ సెంట్రల్ హోమ్ అఫైర్స్ వారు, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి (తేదీ: 31.10.2025) సందర్భంగా ఈ 'కేంద్రీయ గృహమంత్రి దక్షత పథక్' అవార్డ్స్ ప్రకటించారు.గతంలో ఈ నాలుగు విభాగాలకు నాలుగు వేర్వేరు అవార్డులు 1.స్పెషల్ ఆపరేషన్ మెడల్, 2.యూనియన్ మినిస్టర్ మెడల్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిగేషన్, 3.అసాధారణ ఆసూచన కుశలత పథక్, 4.యూనియన్ మినిస్టర్ అవార్డ్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ ఇన్ ఫోరెన్సిక్ సైన్స్, పేర్లతో ఉండగా, ఫిబ్రవరి-2024 లో నాలుగు అవార్డులను కలిపి ఒకే అవార్డ్ పేరిట ఇవ్వాలనినిర్ణయించినారు. ఈ సంవత్సరం తమ విధి నిర్వహణలో అత్యంత సమర్థతతో డ్యూటి చేసిన ఐ జి స్థాయి అధికారి నుండి కానిస్టేబుల్ స్థాయి అధికారి వరకు మొత్తం 1466 మంది పోలీసు అధికారులకు భారత ప్రభుత్వం ఈ అవార్డ్ ప్రకటించినది. ఇందులో పహల్గామ్ ఉగ్ర దాడికి తెగబడిన ఉగ్రవాదులను ఏరివేయడానికి భారత సైన్యం, భద్రతా దళాలు, జమ్మూ పోలీసులు సంయుక్తంగా చేపట్టి విజయం సాధించిన 'ఆపరేషన్ మహాదేవ్' లో పాలుపంచుకున్న కాశ్మీర్ రేంజ్ ఐ జి వి.కె.బిర్డీ, శ్రీనగర్ సీనియర్ ఎస్ పి జీ.వీ.సందీప్ చక్రవర్తి లతో సహా 19 మంది జమ్మూకాశ్మీర్ పోలీసులు ఈ అవార్డ్ గ్రహీతలలో ఉన్నారు. మన తెలంగాణా రాష్ట్రం నుండి ఎంపికైన అధికారులు ఇన్స్పెక్టర్లు: 1.చంద్రబాబు నగరి, భువనగిరి రూరల్ సిఐ, రాచకొండ, ఉపేందర్ రావు జాల, ఇన్స్పెక్టర్, సైబరాబాద్, తిరుపతి వాసాల, ఇన్స్పెక్టర్, సిఐ సెల్, వారు నేర పరిశోధనలో విశిష్ట ప్రతిభ కనబరిచినందుకు ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎన్నికైనారు. అదేవిధంగా స్పెషల్ ఆపరేషన్ విభాగంలో సిఐ సెల్ కు చెందిన ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు 1.ఏ.లక్ష్మణ్ రావు, 2.జి.జాకబ్ లు ఈ అవార్డుకు ఎన్నికైనారు.

# .ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో వైద్య సేవలు సక్రమంగా అందించాలి

### డాక్టర్లు3గంటలు కూడ పనిచేయటం లేదు

### సబ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన సిపిఐ నేతలు



మిర్యాలగూడ , నవంబర్ 3:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో సరిపోను డాక్టర్లున్న పని చేసే వారు లేరని, హాస్పిటల్ పని తీరు మెరుగు పర్చాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు కోరారు.సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయ డిఎఓ శ్రీనివాస్ శర్మ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా హాస్పటల్ కు చుట్టుపక్క ఆరు మండలాల నుండి టౌన్ నుండి పేషెంట్లు పెద్ద సంఖ్యలో పోతున్నారన్నారు కానీ అక్కడ డాక్టర్లు నిర్లక్ష్యం చేయటం వలన ఇన్ పేషెంట్లు సరైన వైద్యమందక పేషెంట్లు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు ప్రతిరోజు డాక్టర్లు 10 గంటలకు వచ్చి12 గంటలలోపే వెళ్లి పోతున్నారన్నారు. కానీ అక్కడ డాక్టర్లు నిర్లక్ష్యం చేయటం వలన ఇన్ పేషెంట్లు సరి అయిన వైద్యమందక పేషెంట్లు ఇబ్బందులకు గురవుతున్నారని వారన్నారు ప్రతిరోజు డాక్టర్లు 10 గంటల వచ్చి12 గంటలలోపే వెళ్లి పోతున్నారు. గవర్నమెంట్ హాస్పిటల్లో పనిచేసే డాక్టర్లకు ప్రైవేటు హాస్పిటల్లు ఉండటం వలన వెంటనే సమయపాలన పాటించకుండ వెళ్ళిపోతున్నారన్నారు అదేవిధంగా నర్సుల బదులు వార్డు బాయ్ లే ఇంజక్షన్లు ఇస్తున్నారు, గుల్కోజులు పెడుతున్నారని దానివలన పేషంట్లకు ఇబ్బంది అవుతుందన్నారు. ఏరియా హాస్పిటల్ లో సరైన మౌలిక వసతులు లేక పేషెంట్లు అనేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. ఒక వార్డులో ఒక బాత్రూమ్ ఒక లెట్రిన్ ఉండటం వలన ఆడవాళ్లు మగవారు ఒకే బాత్ రూమ్ ఉపయోగించడం వలన ఇన్ పేషెంట్లు చాలా ఇబ్బందులు గురవుతున్నారన్నారు. వార్డుల వారిగా చూస్తే కొన్ని ఏరియాలలో లైట్లు కొన్ని వార్డులలో ఫ్యాన్లు లేక, మంచినీటి వసతులు లేక పేషెంట్లు ఇబ్బందుల గురవుతున్నారని ఎమర్జెన్సీలో గర్భిణీ స్త్రీలు డెలివరీ కోసం పోతే వెంటనే ఆమెకు ఇబ్బంది ఉన్నదని జిల్లా హాస్పిటల్ నల్లగొండకు రాస్తాము పోవాలని చెపుతున్నారన్నారు. హాస్పిటల్ మీద పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ప్రజాప్రతినిధులు,

అధికారులు ఆలోచన చేసి యుద్ధప్రాతిపదికపై డాక్టర్లు సక్రమంగా డ్యూటీ చేసే విధంగా అదేవిధంగా మౌలిక వసతులు కల్పించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, మండల కమిటీ సభ్యులు గోగుల యాదగిరి, మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షురాలు దాసర్ల దుర్గమ్మ, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఎస్కే షమీం, మధ్యాహ్నం భోజనం జిల్లా కార్యదర్శి బంటు రాజేశ్వరి, బోస్కో పరమేష్, విజయ, డి.వెంకన్న పాల్గొన్నారు

# బకాయి రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని కొనసాగుతున్న కళాశాలల బంద్




మిర్యాలగూడ నవంబర్ 3:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణంలోని విజేత డిగ్రీ కళాశాలలో ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు ప్రకటించిన నిరవధిక బంద్ కు మద్దతు తెలుపుతూ బంద్ సోమవారం కొనసాగించారు. నాలుగేళ్లుగా ఆయా ప్రభుత్వాలు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ లు ఇవ్వక పోవడం వలన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారింది. అధ్యాపకుల జీవితాలు దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేయబడ్డాయి. యాజమన్యాలు అర్థాంతరంగా కళాశాలలను మూసుకోవలసి వచ్చింది. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేరని సందర్భంగా కళాశాల విద్యార్థులు స్వచ్ఛందంగా తరగతులు బహిష్కరించారు. అలాగే భవిష్యత్ లో నిర్వహించబోయే పరీక్షలు, ప్రాక్టికల్స్ ను కూడా నిర్వహించలేమని యాజమాన్యాలు ప్రకటించాయి. అధ్యాపకులు, విద్యార్థులు వీధుల వెంట తిరుగుతూ బకాయిపడ్డ రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ లను విడుదల చేయాలని ప్రభుత్వపై ఒత్తిడి పెంచేందుకు దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు . అనంతరం ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ధనుంజయ, వైస్ ప్రిన్సిపాల్ మధు, చారి, యాదయ్య, దుర్గయ్య, హరి, ప్రభాకర్ రమేష్, రాజారాం, సతీష్ వీరయ్య, చారి, జ్యోతి, సైదమ్మ , శ్రీరాం, స్వామి విద్యార్థులు పాల్గొన్నారు

# నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తూకం చేపట్టాలి

### తక్షణమే తూకం చేపట్టాలి

### కొనుగోలులో వేలిముద్ర నిబంధనలు తరలించాలి

### పంట సాగును పరిగణలోకి తీసుకోవాలి

### మొక్కజొన్న 14 శాతం మ్యాచర్, 6శాతం ఫారెన్ మ్యాటర్

### నిబంధనల సలింపుతో రైతులకు ఊరట

### మాజీ మంత్రి జీవన్ రెడ్డి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 3

ఆహార ధాన్యాల అమ్మకంలో నిబంధనలతో కూడిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా తూకం చేపట్టాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు పలు సమస్యలను మాజీ మంత్రి జీవన్ రెడ్డి దృష్టికి తీసుకురాగా అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎకరా 18 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు నిబంధనలతో రైతులు నష్టపోతున్నారని ఎకరా 30 క్వింటాళ్లు దాన్యం కొనుగోలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రికి లేఖ రాశానని అన్నారు. ప్రభుత్వం పరిశీలించి 18 క్వింటాళ్ల నిబంధనను సడలించి ఎకరా 25 క్వింటాళ్లు కొనుగోలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు ఊరట లభించిందన్నారు. ధాన్యం అమ్మేందుకు రైతులకు వేలు ముద్ర నిబంధనలతో కౌలు, వలస రైతులు ఇబ్బందులు పడతారని పాసుపుస్తకం, వ్యవసాయ శాఖ అధికారులు పంట సాగును పరిగణలోకి తీసుకొని ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. అకాల వర్షానికి నేలకొరిగిన, ధాన్యం తడిసిన స్థానిక కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్ట వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తే ఎకరా 10 వేల చొప్పున నష్టపరిహారం అందిస్తుందన్నారు. కొనుగోలు ప్రారంభమైనప్పటికీ తూకంలో జాప్యం జరుగుతుందని అధికారులు స్పందించి తక్షణమే తూకం చేపట్టాలన్నారు. మొక్కజొన్న కొనుగోలులో ఆహార ధాన్యాల్లో సగటు నాణ్యత ప్రమాణాలు మొక్కజొన్న 14 శాతం మ్యాచర్, 6శాతం ఫారెన్ మ్యాటర్ నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి, పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్,మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్,నాయకులు కొయ్యేడి మహిపాల్, దాసరి గంగాధర్, తలారి రాజేష్, బత్తిని భూమయ్య, షాకీర్, జలంధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ద్వాదశి పర్వదినం పురస్కరించు కొని ప్రత్యేక పల్లకి సేవ..

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 3

ఆదివారం భానువాసరే కార్తీక మాసం శుక్ల పక్షం ద్వాదశి పర్వదినం సందర్భంగా జగిత్యాల పట్టణం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగింది. సూర్య భగవానుని విశిష్టత : ఆదివారం %-% సూర్య భగవానుని ప్రత్యేక దినం ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, మరియు ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. అష్టమి పర్వదినం పురస్కరించుకొని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగ వానుకి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమములో ఫౌండర్ అండ్ ఛైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న, వోడ్నాల శ్రీనివాస్, భారతాల రాజ సాగర్, వడ్ల గట్ట గోపి, స్వాతి, చెన్నూరి శ్రీధర్– సరోజన, జోగ రమేష్ – లత, ప్రవీణ్,తోట ప్రసాద్, గంగాధర్, అర్చకులు శ్రీ హరి, తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి ఐ టి ఐ కళాశాలలో అప్రెంటిస్ షిప్ మేళ

### - కళాశాల ప్రిన్సిపాల్ జయమ్మ

కల్వకుర్తి నవంబర్ 3 వార్త మిర్రర్ ప్రతినిధి:-కల్వకుర్తి ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రధానమంత్రి షిఫ్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐటిఐ కళాశాలలో ఉత్తీర్ణతలైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెబ్ dÕ{Ù//:%https://www. apprenticeship in dia.gov.in లో రిజిస్ట్రేషన్ చేసుకొని ధృవ పత్రాలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 7893122605, 8096402785, ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.



## శ్రీశ్రీ మాత నల్లపోచమ్మను దర్శించుకున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ నవంబర్ 3 : శ్రీ శ్రీ మాత నల్లపోచమ్మ దేవాలయం ముఖద్వారం పూజ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. స్థానికుల వినతితో స్థానిక యువనాయకుడు చౌలాహరిబాబు ఆలయ ముఖద్వారం ఏర్పాటు చేసేందుకు ముందుకువచ్చి ద్వారానికి అయ్యే ఖర్చును భరించారు. ఆలయ ముఖ ద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం చౌలా హరిబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీఆర్ఎస్ నాయకులు మేడల మల్లికార్జున్, కాంగ్రెస్ నాయకులు ప్రకాష్ రెడ్డి, బీజేపీ నాయకులు రాగిరి మోహన్ రెడ్డి, దేవాలయం కమిటీ సభ్యులు డి. నర్సింగరావు, డి. బిక్షపాతి, జంగం అశోక్, ఆశన్న, వాసు, నాగరాజ్. కమిటీ సభ్యులు హరి బాబు పాల్గొన్నారు.



## అదుపుతప్పిన ప్రైవేటు స్కూల్ బస్సు తప్పిన ప్రమాదం

మిర్యాలగూడ, నవంబర్ 3:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణంలోని అగ్రిగోల్డ్ కాలనీ వద్ద సోమవారం ఉదయం ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపుతప్పి బురదలో ఇరుక్కుని ఓవైపుకు ఒరిగి పోయింది. పాఠశాల బస్సు ఒరిగిపోవడంతో వెంటనే బస్సులో ఉన్న 17 విద్యార్థులను కిందికి దింపారు. తృటిలో ప్రమాదం తప్పింది. ఎలాంటి హాని జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

## నేటి ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 3లయన్స్ క్లబ్ జగిత్యాల వారి ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి వారిచే కిష్టంపేట మాజీ సర్పంచ్ తంగెల్ల రమేష్ సౌజన్యంతో రాయికల్ మండలం కిష్టంపేట గ్రామం లో రైతు సేవా సంఘ%శీ% అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం రోజున నిర్వహించే ఉచిత నేత్ర వైద్య శిబిరం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించబడును. కావున కిష్టంపేట గ్రామ ప్రజలు, పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకువాలని మాజీ సర్పంచ్ లయన్ తంగెల్ల రమేష్, జగిత్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు వడ్లగట్ట శంకర్, కార్యదర్శి గుండేటి గంగాధర్, కోశాధికారి సామల్ల శ్రీహరి ఒక ప్రకటనలో కోరారు.



## సహస్ర (వేయి) లింగాల దేవాలయంలో ఘనంగా అన్నపూజ మహెూత్సవం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి నవంబర్ 3

జగిత్యాల రూరల్ మండలం పొలాస లో గల సహస్ర (వేయి) లింగాల దేవాలయంలో కార్తీక సోమవారం సందర్భంగా అన్నపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి అన్నం, పప్పు, మిఠాయిలు, పాయసం వంటి వండిన ఆహారాన్ని శివలింగాలకు నైవేద్యంగా సమర్పించారు, అర్చకులు మంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించి, ప్రసాదంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అండ్ ఫౌండర్ నలమాస గంగాధర్, అర్చకులు ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఒక్క ఎమ్మెల్యే జీతం కనీసం ఒక నెలయినా బకాయి ఉందా?

### విద్యార్థుల స్కాలర్షిప్, ఫీజ్ రీయింబర్స్మెంట్ 8 వేల కోట్ల బకాయిలా... ఎస్ఎఫ్ఐ నేత శంకర్

### ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ ముందు ఎస్ఎఫ్ఐ ధర్నా

మిర్యాలగూడ, నవంబర్ 3:- (వార్త మిర్రర్)ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మిర్యాలగూడ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కాలేజీలు సమ్మెకు పోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో పేద మధ్యతరగతి విద్యార్థులకు స్కాలర్షిప్ విడుదల చేయకపోవడంతో ఉన్నత చదువులకు వెళ్లాల్సిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పేద విద్యార్థులు కళాశాలలో సర్టిఫికెట్ల కోసం వెళ్తే ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు టీసీలు ఇస్తామంటూ విద్యార్థులనుఇబ్బందులకు గురి చేస్తూ విద్యార్థుల దగ్గర ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ కళాశాల యజమాన్యాలతో చర్చలు జరిపి పేద మధ్యతరగతి విద్యార్థుల చదువులకు అటంకం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రైవేట్ కళాశాల యజమాన్యాలతో జరిపిన చర్చల్లో భాగంగా ఇస్తానన్న 1,200 కోట్లు విడుదల చేయడానికి ఎంత రాద్ధాంతం చేస్తూ పేద మధ్యతరగతి విద్యార్థులు చదువులను రోడ్డున పడేస్తున్నారు. పాలకులు మారిన ప్రభుత్వాలు మారిన పేద మధ్యతరగతి విద్యార్థులకు ఇచ్చే స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయడానికి విద్యార్థులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ స్కాలర్షిప్ల కోసం ఆందోళన చేసిన విద్యార్థులు రాష్ట్రం వచ్చినంక కూడా స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ కోసం విద్యార్థులు రోడ్ ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.



విద్యార్థులతో పెట్టుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పునాదులు కదులుతాయన్న చరిత్రను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోవద్దన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు స్కాలర్షిప్ ప్రభుత్వాల బిక్ష కాదని విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన హక్కన్నారు. విద్యార్థులు సిఎం రేవంత్ రెడ్డిని క్యాబినెట్ల మినిస్టర్ పోస్ట్ గాని అసెంబ్లీలో సీటు గాని అడగలేదని విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ మాత్రమే రేవంత్ రెడ్డిని అడిగారన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ డే విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరినీ కూడా గట్టి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదానాయక్, జిల్లా కమిటీ సభ్యులు మూడావత్ జగన్నాయక్, ప్రసన్న సంపత్, న్యూమన్, సూర్య, బన్నీ, నాగేష్, బురాన్, సమీర్ కుమార్, దేవా, సంజయ్ హనుమాన్ పాల్గొన్నారు

# దేవరకొండ ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట నిరసన చేసిన ఎస్ఎఫ్ఐ

### తెలంగాణ రాష్ట్రంలో ఏఒక్క ఎమ్మెల్యే జీతలు నెల బకాయి ఉందా

### స్కాలర్షిప్ ఫీజ్ రీయింబర్స్మెంట్ 8, వేల కోట్లు ఎందుకు బకాయిలు ఉన్నాయి

దేవరకొండ నవంబర్ 03 వార్త మిర్రర్ ::భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే కార్యాలయం ముందు నిరసన తెలియజేసి ఆఫీస్ సిబ్బందికి ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేయడం జరిగింది అనంతరం ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు జల్లెల ఇద్దిరాములు, బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ కాలేజీలు సమ్మెకు పోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో పేద మధ్యతరగతి విద్యార్థులకు స్కాలర్షిప్ విడుదల చేయకపోవడంతో ఉన్నత చదువులకు వెళ్లాల్సిన ఎస్సీ, ఎస్టీ బీసీ,మైనార్టీ పేద విద్యార్థులు కళాశాలలో సర్టిఫికెట్ల కోసం వెళ్తే ఫీజులు పెడితేనే సర్టిఫికెట్లు టీసీలు ఇస్తామంటూ విద్యార్థులన. ఇబ్బందులకు గురి చేస్తూ విద్యార్థుల దగ్గర ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ కళాశాల యజమాన్యాలతో చర్చలు జరిపి పేద మధ్యతరగతి విద్యార్థులు చదువులకు అటంకం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రైవేట్ కళాశాల యజమానియాలతో జరిపిన చర్చల్లో భాగంగా ఇస్తానన్న 1200 కోట్లు విడుదల చేయడానికి ఎంత రాద్ధాంతం చేస్తూ పేద మధ్యతరగతి విద్యార్థులు చదువులను రోడ్డున పడేస్తున్నారు.పాలకులు మారిన ప్రభుత్వాలు మారిన పేద మధ్యతరిత విద్యార్థులకు ఇచ్చే స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల చేయడానికి ప్రభుత్వాలు విద్యార్థులపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ స్కాలర్షిప్ ల కోసం ఆందోళన చేసిన విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం వచ్చినంక కూడా స్కాలర్షిప్ ఫీజు




రియంబర్స్మెంట్ కోసం విద్యార్థులు రోడ్ ఎక్కాల్సిన పరిస్థితి తెలంగాణలో ఏర్పడిందన్నారు. విద్యార్థులతో పెట్టుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పునాదులు కదులుతాయన్న చరిత్రను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోవద్దు అన్నారు . తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పేద మధ్యతరగతి విద్యార్థులు స్కాలర్షిప్ ప్రభుత్వాల బిక్ష కాదని విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన అక్కని అన్నారు. మావిద్యార్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని క్యాబినెట్ల మినిస్టర్ పోస్ట్ గాని అసెంబ్లీలో సీటు గాని అడగలేదని విద్యార్థులకు రావాల్సిన స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ మాత్రమే అడిగారని రేవంత్ రెడ్డి అడిగారన్నారు.తక్షణమే పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ డే విడుదల చేయకుంటే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులందరినీ కూడా గట్టి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గుండాల మల్లేష్,రాజేష్,రోహన్ రసమళ్ళ సింహాద్రి,నేతళ్ళ జయరాం, మహేష్ ,ప్రమీల, శారద,అంజలీ, అనురాధ, షాబితా,మధు ప్రియా,సోని, గీతంజాలి తదితరులు పాల్గొన్నారు..

# నేరేడుగోమ్ము లో ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

### 8500కోట్ల స్కాలర్షిప్స్, ఫీజురియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

నేరేడుగోమ్ము నవంబర్ 03 వార్త మిర్రర్ ఏబీవీపీ నేరేడుగోమ్ము నగర కమిటీ ఆధ్వర్యంలో కళాశాలల విద్యార్థులతో ర్యాలీ మరియు బస్టాండ్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. లిఈ సందర్భంగా ఏబీవీపీ నల్గొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూతెలంగాణ రాష్ట్రంలో పాలకులు మారిన ప్రజల బ్రతుకులు మారడం లేదని గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మరింత విధ్వంసం చేస్తుందని . పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువు కోసం సంజీవని లాంటి ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని ఈ ప్రభుత్వం తూట్లుపొడిచే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు అని. గత మూడు సంవత్సరాలుగా దాదాపు రూ. 8500 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో ఉన్నా ఈ ప్రభుత్వం నిమ్మకు నీలెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరును ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుంది. రాష్ట్రంలో స్కాలర్షిప్స్, రీయింబర్స్మెంట్ పై ఆధారపడి దాదాపు 15 లక్షల మందికి పైగా విద్యను అభ్యసిస్తున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం స్కాలర్షిప్స్ ఇవ్వకుండా. ఫీజు రీయింబర్స్ విడుదల చేయకుండా పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టే కుట్ర



చేస్తుంది. పేద విద్యార్థులపై ప్రభుత్వ కుట్రలు ఆపి వెంటనే పెండింగ్లో ఉన్న 8500 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ లను విడుదల చేయాలనీ ఏబివిపి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుంది విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి,మానస,పూజ,స్వాతి,అఖిల,పగిళ్ల విక్రం, ఐత రాజు కొండల్, భూష రాజు రాకేష్, అరవింద, చందు, వంశీ తదితరులు పాల్గొన్నారు..

## భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం..

### భారత దేశ సైనికుల పైన అనుచిత వ్యాఖ్యలు ను ఖండిస్తున్నాము...

### మండల అధ్యక్షులు కైరం కొండ అశోక్,

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 03చౌటుప్పల లో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. జూబ్లీహిల్స్ ఎలక్షన్ లో ప్రచారంలో భాగంగా హిందు,వుల పైన భారత దేశ సైనికుల పైన అనుచిత వ్యాఖ్యలు చేసినటువంటి సీఎం రేవంత్ రెడ్డి పుటకు కో పార్టీ మరే రేవంత్ రెడ్డి భారత సైన్యం యొక్క చరిత్ర తెలియని మూరు?డు ఆపరేషన్ సింధూరపైన అనుచిత వ్యాఖ్యలు చేసినటువంటి కాంగ్రెస్ పార్టీ పాకిస్తాన్ మీద ఉన్నటువంటి ప్రేమ పుట్టిన దేశం మీద లేకపోవడం సిగ్గు శేటు ఎంఐఎం పార్టీ ఓటు బ్యాంకు కోసం హిందువుల పైన భారతీయ జనతా పార్టీ పైన నోటికొచ్చినట్టు మాట్లాడడం సరికాదు పూటకో పార్టీ మారుస్తూ రేవంత్ రెడ్డి తన అవసరం కోసం ఎంతకైనా దిగజారే విధంగా మాటలు మాట్లాడుతున్నారు.గతంలో భారత సైన్యం యొక్క పోరాటాన్ని అవమానపరిచి మాట్లాడిన కేసీఆర్ కి తెలంగాణ ప్రజలు చెప్పిన గుణపాటమే కాంగ్రెస్ పార్టీకి అదేగతి పడుతున్నది నిజం.ఈ కార్యక్రమం లో మండల




అధ్యక్షులు కైరం కొండ అశోక్,దూడల బిక్షం గౌడ్,గుజ్జుల సురేందర్ రెడ్డి,కంచర్ల గోవర్ధన్ రెడ్డి, చినుకని మల్లేష్ యాదవ్ యాస అశోక్ రెడ్డి పబ్బతి శేఖర్ గౌడ్, కట్ట కృష్ణ,లగోని పాండు,పోట్టబత్తిని బాలరత్నం,పులిగిల్ల శ్రీనివాస్ చారి, అల్మాస్పేట గౌతమ్,గుర్రం రవీందర్, పాలాది పాండు,మద్దోదు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

# విశ్రాంత ఉద్యోగుల భారీ నిరసన దీక్ష “చలో హైదరాబాద్”

### గోడపత్రిక, బ్రోచర్ ఆవిష్కరణ

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి నవంబర్ 03

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో తేదీ 7 నవంబర్ 2025 రోజున పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తలపెట్టిన భారీ నిరసన దీక్ష కొరకు “చలో హైదరాబాద్”విజయవంతం కొరకు గోడపత్రికలను మరియు బ్రోచర్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చౌటుప్పల శాఖ అధ్యక్షులు భీమిడి మోహన్ రెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి కానుగుల వెంకటయ్యలు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల సాధనకై చేపట్టిన భారీ నిరసన దీక్షలో అందరూ పెన్షనర్లు పాల్గొనాలని తెలిపారు. అదేవిధంగా పెన్షనర్లకు నగదు రహిత ఉద్యోగుల ఆరోగ్య పథకం ( ఈ హెచ్ ఎస్) లో మరియు సేవలు అందించాలని, పెన్షనర్లకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలన్నీ ఏక మొత్తంలో చెల్లించాలని, పెండింగ్ లో ఉన్న కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, 01 జూలై 2023 నుండి పే రివిజన్ కమీషన్ అమలు చేస్తూ బకాయిలు చెల్లించాలన్న న్యాయమైన కోరికల సాధనకై చేపట్టిన భారీ నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరారు ఈ




కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆర్థిక కార్యదర్శి బడుగు శ్రీరాములు, ఉపాధ్యక్షులు నారగోని కృష్ణ గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వి. బిక్కు నాయక్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బద్దం వసంత, ముఖ్య నాయకులు చోల్లేటి రాజయ్య, బాతరాజు ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు...

# డియాస్ ఇరాయ్



మలయాళ అగ్ర నటుడు మోహన్‌లాల్ తనయుడు ప్రణవ్ 'హృదయం' చిత్రంతో దక్షిణాది ప్రేక్షకులకు చేరువయ్యారు. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా సినిమా 'డియాస్ ఇరాయ్'. మిస్టరీ హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో శ్రీస్రవంతి మూవీస్ విడుదల చేస్తున్నది. ఈ చిత్రానికి రాహుల్ సదాశివన్ దర్శకత్వం వహించారు. ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. విభిన్న కథాంశంతో రూపొందిన ఈ మిస్టరీ థ్రిల్లర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని శ్రీస్రవంతి మూవీస్ అధినేత రవికిషోర్ తెలిపారు. సుస్మితాభట్, జిబిన్ గోపీనాథ్, జయ కురుప్, మనోహరి జాయ్ తదితరులు ఈ చిత్ర తారాగణం. క్రిస్టో జేవియర్ సంగీతాన్నందించారు.



# రాజ్‌తరుణ్ కథానాయకుడిగా 'చిరంజీవ'

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా నటించిన 'ఆహా' ఒరిజినల్ ఫిల్మ్ 'చిరంజీవ'. కుషిత కల్లపు కథానాయిక. అభినయ కృష్ణ దర్శకుడు. రాహుల్ అవుదొడ్డి, సుహాసినీ రాహుల్ నిర్మాతలు. నవంబర్ 7న ఈ సినిమా 'ఆహా' ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం వినోదం, యాక్షన్‌తో కూడుకొని ఉంది. ఇందులో రాజ్‌తరుణ్ పోషించిన పాత్ర పేరు శివ. తను పుట్టగానే మహర్జాతకుడు అవుతాడని పండితులు చెబుతారు. చిన్నప్పట్నుంచీ తనకు స్పీడెక్కువ. అందుకు తగ్గట్టు ఆంబులెన్స్ డ్రైవర్ అవుతాడు. అనుకోకుండా రోడ్ ప్రమాదానికి గురైన శివకు తనకు తెలీకుండానే అతీంద్రియ శక్తులు వచ్చేస్తాయి. ఎవరెవరు ఎంతకాలం జీవిస్తారో తనకు తెలిసిపోతుంటుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అనే ప్రశ్నతో ట్రైలర్ ముగించారు. ఈ చిత్రానికి కెమెరా: రాకేష్ ఎస్.నారాయణ్, సంగీతం: అచ్చుమణి.



# విందు భోజనంలా మాస్‌జాతర

అగ్ర హీరో రవితేజ కథానాయకుడిగా రూపొందిన భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాస్ జాతర'. శ్రీలీల కథానాయిక. భాను భోగవరపు దర్శకుడు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని సోమవారం విడుదల చేశారు. రవితేజ మార్క్ పంచ్ డైలాగులతో, భారీ యాక్షన్ సన్నివేశాలతో ఫ్యాన్స్ కోరుకునే మాస్ అంశాలతో ఆద్యంతం వినోదాత్మకంగా ట్రైలర్ సాగింది. హీరో, విలన్ల మధ్య ఉత్కంఠరేకెత్తించే సంఘర్షణ ట్రైలర్‌కు హైలైట్. నవీన్‌చంద్ర విలన్‌గా రవితేజను ఢీకొట్టే పాత్రలో కనిపించారు. శ్రీలీల అందం, శ్రీకాకుళం యాసలో తను మాట్లాడిన తీరు, రవితేజ, శ్రీలీల ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీ ట్రైలర్‌కు మరింత అందాన్ని తెచ్చాయి. భీమ్స్ సిసిరోలియో కూడా తన నేపథ్య సంగీతంతో వింటేజ్ రవితేజ ఆరాను గుర్తు చేశారు. ఆకట్టుకునే పాటలు, అద్భుతమైన వినోదం మొత్తంగా విందుభోజనాన్ని తలపించిందీ ట్రైలర్. ఈ సినిమాకు కెమెరా: విధు అయ్యన్న.

# షాకైన సలార్ బ్యూటీ


సౌత్ స్టార్ హీరోయిన్ శృతి హాసన్ ప్రస్తుతం తెలుగు, తమిళ, హిందీ సినిమాలతో బిజీగా ఉంది. విజయాల పరంగా కాస్త అసంతృప్తి ఉన్నప్పటికీ, ఆఫర్ల పరంగా మాత్రం ఎప్పుడూ కొదవలేదు. ఇటీవల వరుసగా 'వాల్తేరు వీరయ్య', 'సలార్' సినిమాలతో బాక్సాఫీస్ వద్ద హిట్లు కొట్టిన శృతి, రీసెంట్‌గా 'కూలీ' ద్వారా ప్రేక్షకులను అలరించింది. ఇటీవల ఆమె సౌత్ మరియు బాలీవుడ్ ఇండస్ట్రీల మధ్య ఉన్న తేడా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఉన్న నటులు చాలా వినయంగా ఉంటారు. ఇక్కడ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది అని చెప్పుకొచ్చింది. సినిమా ప్రారంభోత్సవం రోజున దేవుడి పటాల ముందు కొబ్బరికాయలు కొట్టడం, పూజలు చేయడం, మనసులో కోరికలు కోరుకోవడం వంటివి సాధారణం. అయితే నేను తొలిసారిగా ఇవి చూసినప్పుడు ఆశ్చర్యపోయాను, ఎందుకంటే మా ఇంట్లో ఇలాంటి ఆచారాలు ఎప్పుడూ ఉండేవి కావు, పూజలు పెద్దగా చేసేవారు కాదు, కానీ క్రమశిక్షణ మాత్రం ఎప్పుడూ ఉండేది అని ఆమె చెప్పింది. అదే సమయంలో బాలీవుడ్‌లో ఈ రకమైన ఆచారాలు పెద్దగా కనిపించవని కూడా శ్రుతి పేర్కొంది. "హిందీ సినిమాల్లో చాలా తక్కువ మంది మాత్రమే ఇలాంటివి పాటిస్తారు. సౌత్‌లో డబ్బు సంపాదించిన వారు కూడా పాత పద్ధతులను గౌరవిస్తుంటారు. వారిని చూస్తే ఇంకా పాత అంబాసిడర్ కారులోనే ప్రయాణిస్తున్నారా అనిపిస్తుంది. వారు ఆడంబరాల కంటే విలువలకు ప్రాధాన్యం ఇస్తారు" అని చెప్పింది. తన తండ్రి కమల్ హాసన్ విషయానికొస్తే, ఆయన కూడా దేవుళ్లు, ఆచారాలు నమ్మని వ్యక్తి అని శ్రుతి గుర్తుచేసింది. "కమల్ గారు ఎప్పుడూ తన సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారు. పలు సందర్భాల్లో ఆయన వ్యాఖ్యలు వివాదాలకు దారితీసినా, తాను నమ్మిన దారినే ఎంచుకుంటారు. ఆ లక్షణం నాకు కూడా వచ్చింది" అని శృతి హాసన్ స్పష్టం చేసింది.



# సమాంతర ప్రపంచాల నేపథ్యంలో..

అగ్ర హీరో అల్లు అర్జున్ కథానాయకుడిగా, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో ఓ భారీ పానిండియా చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. AA22xA%6 వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని సైన్స్ ఫిక్షన్‌తో కూడిన ట్కస్టైలిష్ డ్రామాగా దర్శకుడు అట్లీ రూపొందిస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమాపై ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో హల్‌చల్ చేస్తున్నది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం ముంబైలో జరుగుతున్నది. దీనికోసం ఓ భారీ సెట్‌ను కూడా నిర్మించారు. ఈ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్నారట. బన్నీతోపాటు కీలక తారాగణం పాల్గొంటున్న ఈ షూట్‌లో మృణాళ్‌ఠాకూర్ ఎంట్రీ ఇచ్చారనేది లేటెస్ట్ న్యూస్. ఇందులో మృణాళ్ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే.. ఈ సినిమా కథ విషయంలో కూడా ఓ ఆసక్తికరమైన విషయం వెలుగు చూసింది. ఇది రెండు సమాంతర ప్రపంచాల నేపథ్యంలో సాగే కథట. ఈ రెండు ప్రపంచాలకూ గల సంబంధమేంటి? అనేది ఇందులో ఆసక్తికరమైన అంశం. బన్నీ ఇందులో మల్టిపుల్ క్యారెక్టర్లు చేస్తున్నట్టు గతంలో వార్తలొచ్చాయి. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఇందులో ఆయన ద్విపాత్రాభినయం మాత్రమే చేస్తున్నారట. దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్, మృణాళ్ ఠాకూర్ కీలక పాత్రధారులు. ప్రతిష్టాత్మక సన్ పిక్చర్స్ అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం విడుదల తేదీని సంక్రాంతికి ప్రకటించే అవకాశం ఉంది.





# అందమైన ఫిగరు నువ్వా..

నాగశౌర్య కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్యాడ్‌బాయ్ కార్తీక్'. రామ్ దేశిన దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని శ్రీవైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం నుంచి 'అందమైన ఫిగరు నువ్వా' అనే పాటను విడుదల చేశారు. హారిస్ జైరాజ్ స్వరపరచిన ఈ పాటను కృష్ణకాంత్ రచించారు. శ్రీధర్ సేన, ప్రియా జెర్సన్ ఆలపించారు. ఈ పాటలో నాయకానాయికలు నాగశౌర్య, విధి మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకునేలా ఉంది. త్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సముద్రఖని, నరేష్ వీకే, సాయికుమార్, మైమ్ గోపి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హారిస్ జైరాజ్, రచన-దర్శకత్వం: రామ్ దేశిన (రమేష్).